రేపటి నుంచి మిర్చి కొనుగోళ్లు షురూ

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి22 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి కొత్త మిర్చి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి శంషీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి మిర్చిని ఉదయం 8 గంటల్లోపే యార్డుకు పూర్తిగా ఎండబెట్టి, నాణ్యతగా తీసుకురావాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న గ్రామ, వార్డు సభలు


మానుకోటలోని ఎన్జీవోస్ కాలనీ వద్ద వార్డు సభలో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామసభలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అర్హుల జాబితా ఎంపిక కోసం అధికారులు సభలు నిర్వహిస్తున్నారు. గ్రామ, వార్డు సభల్లో సంక్షేమ పథకాలకు అర్హులైనప్పటికి తమపేర్లు జాబితాల్లో లేవని ప్రజలు అధికారులతో వాగ్వావాదానికి దిగుతున్నారు. అర్హతలున్నప్పటికి ఎందుకు ఎంపిక చేయలేదని నిలదీస్తున్నారు. పెద్దనాగారంలో అనర్హులకు సంక్షేమ పథకాలు కేటాయించడంపై యువకులు జీపీ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. గంగారం, గార్ల, పెద్దవంగర తదితర మండలాల్లో జనం మండిపడ్డారు.

- మహబూబాబాద్ టౌన్, (ఆంధ్రజ్యోతి)

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- డాక్టర్లు అందుబాటులో ఉండాలి
- కేంద్ర, రాష్ట్ర వైద్య బృందం సూచన
- ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి

గార్ల పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో కేంద్ర, రాష్ట్ర వైద్య బృందం


6

ఏడేళ్ల గోస.. తీరేనా ఆశ

'భూ భారతి'పై నారాయణపురం రైతుల భరోసా



- కొలిక్కి రానున్న 'ధరణి'తో ఏర్పడ్డ సమస్యలు
- అసెంబ్లీలో ప్రస్తావించిన మంత్రి పొంగులేటి
- హడావుడిలో అవకతవకలు - సర్వేలో లేని వారికి పట్టాల జారీ
- ఇబ్బందులు పడుతున్న 800 మంది కర్షకులు
- వందల కొద్ది రెవెన్యూ రికార్డులు అపరిష్కృతం

మహబూబాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అరువై ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములవి.. రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలున్నప్పటికీ, గత బీఆర్ఎస్ సర్కారు ఆ భూములన్నీ అటవీశాఖ పరిధిలోనివంటూ ధరణిలో నమోదు చేసి, రైతుల పట్టాలను రద్దు చేసింది. భూ ప్రక్షాళనలో నిలిచిన పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం ఏడేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం లభించడం లేదు. ప్రభుత్వాలు మారినా పట్టాదారు పాస్‌పుస్తకాలు మాత్రం ఆ కర్షకులకు అందడం లేదు.

జిల్లాలోని కేసముద్రం మండలం నారాయణపురంలో 2017లో ఏర్పడిన భూ సమస్య కొలిక్కి వచ్చినట్లే వచ్చి, మళ్లీ పెండింగ్‌లో పడింది. ధరణిలో నూతన అంశాలను చేర్చి ఒకేసారి వందల కొద్ది దరఖాస్తులను పరిష్కరించి, నారాయణపురంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేసే ప్రక్రియను ఒక కేస్‌స్టడీగా రెవెన్యూ శాఖ తీసుకున్నప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. నారాయణపురంలోని అనుభవాలను రాష్ట్రంలో ఇదే తరహా సమస్య ఉన్న గ్రామాల్లోను అమలు చేసి పరిష్కరించాలని గత ప్రభుత్వం భావించింది. గ్రామంలో వివిధ రకాల సమస్యలున్న 1,162 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 800 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందాల్సి ఉంది. తాజాగా ధరణి స్థానంలో 'భూ భారతి'ని తీసుకురావడం, కొత్తగా ఆర్‌వోఆర్ చట్టాన్ని శాసనసభలో ఆమోదించిన విషయం విదితమే. ఈ బిల్లు చర్చలో కూడా రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధరణితో ఏర్పడిన సమస్యల్లో ఉదాహరణగా నారాయణపురం గ్రామ భూ సమస్యనే ప్రస్తావించడం గమనార్హం. ఈ నేపథ్యంలో గత రెండేళ్లుగా నారాయణపురం రైతుల అర్జీలన్నీ స్తబ్దుగా ఉండగా, భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

సమస్య ఇదీ..

నెల్లికుదురు మండలం నారాయణపురం పరిధిలోని 43 సర్వే నెంబర్లలో 1,827.12 ఎకరాల భూమి ఈ గ్రామం పరిధిలో ఉంది. ఈ గ్రామాన్ని కేసముద్రం మండల పరిధిలోకి తీసుకురావడంతో ఈ సర్వేనెంబర్లన్నీ 'ఆన్‌లైన్'లో మాయమయ్యాయి. 2017లో భూప్రక్షాళనలో ఆరు సర్వే నెంబర్లలో వెయ్యి మందికిపైగా రైతులు 1963 నుంచి సాగు చేసుకుంటున్న 1420.12 ఎకరాలు అటవీశాఖ పరిధిలోకి వెళ్లాయి. దీంతో ఆయా రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలన్నీ 2017 నుంచి పనిచేయకుండా నిలిచిపోయాయి. అప్పటి నుంచి గ్రామంలోని వెయ్యి మందికిపైగా రైతులకు 12 పర్యాయాలు రైతుబంధు, 50 మందికి పైగా వివిధ కారణాలతో చనిపోయిన రైతు కుటుంబాలకు రైతు బంధు అందకుండా తీవ్రంగా నష్టపోయారు. రైతుల విజ్ఞప్తులతో గత ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ, అటవీశాఖ ఉన్నతాధికారుల ప్రమేయంతో అటవీశాఖ నుంచి 1,420 ఎకరాల భూములను రెవెన్యూ శాఖ పరిధిలోకి తీసుకువచ్చారు. పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించినా సమస్య పరిష్కారం కాలేదు.


నారాయణపురంలో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

పరిష్కారానికి ప్రయత్నంలోనే అక్రమాలు..

నూతన చట్టంతో ధరణి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చేస్తున్న ప్రయత్నంలోనే పలు అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ పరిధిలోకి తీసుకు వచ్చిన భూముల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. 1,417 ఎకరాల విస్తీర్ణంలో రోడ్లు, నివాస స్థలాలు మినహా 1270 ఎకరాలను సాగు భూములుగా తేల్చారు. ఇందులో 700 ఎకరాల్లో పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి. మిగిలిన 570 ఎకరాల్లోని 300 మందికి చెందిన పట్టాదారు పాస్‌పుస్తకాలకు రైతుపేరు, తండ్రిపేరు స్థానంలో 'అడవి' పేరును చేర్చారు. పేరు మార్పిడీ కోసం ధరణి పోర్టల్‌లో 'టీఎం 33' మ్యాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో రైతులు రూ.వెయ్యి వెచ్చించి పలుమార్లు దరఖాస్తు చేసుకున్నారు. అయినప్పటికీ సాంకేతిక సమస్యలతో పేరు మార్పిడీ కాకుండా నిలిచిపోయాయి.

కొద్దిరోజుల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రైతుపేరు 'అడవి'ని తొలగించడంతో పట్టాలిచ్చేందుకు మార్గం సుగమమైంది. ఈ గ్రామ పరిధిలోనే 149 నుంచి 168 వరకు ఆరు సర్వే నెంబర్లలో 700 ఎకరాల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించగా, 140 ఎకరాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ధరణిలోకి వచ్చినప్పటికీ మిగతా వాటికి 'డిజిటల్ సిగ్నేచర్ (డీఎస్) పెండింగ్' చూపుతూ హోల్డ్‌లో పడ్డాయి.

కొద్దిరోజుల క్రితమే ఈ సర్వే నెంబర్లలోనే డిజిటల్ సిగ్నేచర్‌ను క్లియర్ చేశారు. అయితే సందట్లో సడేమియా లాగా ఎంజాయ్‌మెంట్ సర్వే నివేదికలో లేనివారు, అసలు భూమి సాగు చేయని రైతులు, ఒకవేళ సాగు చేసినప్పటికీ వాస్తవం కంటే విస్తీర్ణం అధికంగా

మిగతా 6వ పేజీలో...

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న సీఎం

- గ్రామ, వార్డు సభలతో కాంగ్రెస్ మరోసారి మోసం
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతూ, దాడులు చేయిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని శాసనమండలి సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మార్పు అంటే ఇదేనా? వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా అభివృద్ధి జాడలేదన్నారు. మహాలక్ష్మి, రైతుభరోసా పెంపు, తులం బంగారం పథకాల అమలు ఏమైందని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కూడా అందరికీ కాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర సర్కార్ వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా..

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నామని చెప్పి దరఖాస్తుదారుల జాబితా చదువుతూ పేర్లు లేనివారు మళ్లీ అర్జీలను సమర్పించాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మరోసారి మోసం చేస్తుందని తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆరోపించారు. ఈ సభల్లో ప్రజలు తమ ఆవేదన వెలిబుచ్చుతున్నారని, పనికిమాలిన గ్రామ సభలంటూ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

చర్చించుకుంటున్నట్లు చెప్పారు. మళ్లీ దరఖాస్తులు చేసుకునేందుకు సభలు ఎందుకని ప్రశ్నించారు. అధికార యంత్రాంగాన్ని కేంద్రీకృతం చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ గ్రామ సభలు పెడుతున్నారని, తద్వారా ప్రజలకు ఏమైనా మేలు జరుగుతుందా అని అన్నారు. బోగస్, మోసపూరిత సభలను పెడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల అమలుపై గ్రామ సభల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీయాలని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు తమపోరు ఆగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, నాయకులు జెరిపోతుల వెంకన్న, వెంకటాద్రి, రామకృష్ణ, రాజ్‌కుమార్, వెంకన్న, మార్నేని రఘు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో పార్టీల కతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమఫలాలు అందుతున్నాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముడుపుగల్ గ్రామంలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ప్రజాసంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, ఉపేందర్, రంగన్న, నరేష్, హేమంత్ పాల్గొన్నారు.

బేతోలులో శ్మశాన వాటిక ప్రారంభం..

మహబూబాబాద్ మునిసిపల్ 6వ వార్డు పరిధి బేతోలు గ్రామంలో నిర్మించిన శ్మశాన వాటికను ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ రవీందర్, వార్డు కౌన్సిలర్ సునిత రవి పాల్గొన్నారు.


బేతోలులో శ్మశానవాటికను ప్రారంభిస్తున్న మురళీనాయక్

ఓవర్ లోడ్‌తో వెళ్తే చర్యలు తప్పవు

అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి


ఆటో స్టాండ్ వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెహ్రూసెంటర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ పిల్లలు, ప్రయాణికులు ప్రయాణిస్తున్న ఆటోలు ఓవర్ లోడ్‌తో వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని డీఎఫ్‌వో జంక్షన్ వద్ద ఆటోస్టాండ్‌లో బుధవారం ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ ట్రాఫిక్ నియమనిబంధనలు తెలిసి ఉండాలని సూచించారు. రోడ్డు రవాణా రూల్స్‌కు విరుద్ధంగా ప్రయాణిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.


ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వారిని చూపుతున్న పోలీసులు

గుడుంబా స్థావరాలపై దాడులు

- 8 మందిపై కేసుల నమోదు, బైక్ స్వాధీనం

నెహ్రూసెంటర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, ఓ ద్విచక్రవాఆనం స్వాధీనం చేసుకుని 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు డీటీఎఫ్ సీఐ నీరజ, ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. బుధవారం మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్, డీటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో కురవి మండలం తాట్యతండా, పెద్దతండా, మహబూబాబాద్ మండలం సుందరయ్యతండా, సీతలతండా, అనంతారం, గార్ల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 8 మందిపై 7 కేసులు నమోదు చేశామన్నారు. 41 లీటర్ల నాటుసారా, 20 కిలోల నల్లబెల్లం, 10 కిలోల పటిక సరఫరా చేస్తున్న ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బాధ్యులైన బోడ కోబల్, బోడ లక్ష్మి, కొర్ర అనిత, భూక్య సునీత, మూడ్ కవిత, బాదావత్ భద్రు, పిట్టల రాధ, ఎడ్ల ఎల్లాబాయిపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు చెప్పారు. కాగా, ఇదిలా ఉండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ రైల్వేస్టేషన్ కూడలివద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా, ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాల్ల నల్లబెల్లం, 20 కిలోల పటిక, పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగయ్య, నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్లంపై ఆసక్తిని పెంపొందించేలా
బోధన చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్లంపై భయాన్ని తొలగించి, ఆసక్తిని పెంపొందించేలా బోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్‌లోని ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్‌లో బుధవారం ఇంగ్లీస్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆంగ్ల ఒలంపియాడ్ మరియు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయులు విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఇంగ్లీష్ పత్రికలు, డిక్షనరీలు ఉపయోగించాలన్నారు. విద్యార్థులను స్పెల్‌బి, స్పెల్‌విజర్డ్ మొదలగు పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతీ విద్యార్థి ఆంగ్లపై పట్టుసాదిస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇంగ్లీష్ ఒలంపియాడ్ స్ట్రీమ్ వన్ విభాగంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రథమస్థానం, తొర్రూరు జడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానం, ముప్పారం జడ్పీహెచ్ఎస్ తృతీయ స్థానాల్లో నిలిచాయని ఎల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి బయగాని రామ్మోహన్ తెలిపారు. స్ట్రీమ్ టు విభాగంలో నెల్లికుదురు మోడల్ స్కూల్ ప్రథమ స్థానం, మరిపెడ మోడల్ స్కూల్ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఉపన్యాస పోటీల్లో జడ్పీహెచ్ఎస్ ఆలేరు ప్రథమ, జడ్పీహెచ్ఎస్ కేసముద్రం (స్టేషన్) ద్వితీయ, జడ్పీహెచ్ఎస్ దాట్ల తృతీయస్థానాలు సాధించినట్లు పేర్కొన్నారు. స్ట్రీమ్ టు విభాగంలో చిలుకోడు మోడల్ స్కూల్ ప్రథమ స్థానం, మరిపెడ మోడల్ స్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్వో అప్పారావు, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ఎల్టా బాధ్యులు సత్యనారాయణ, సైదులు రెడ్డి, లక్ష్మయ్య, శ్యామలా దేవి, అనిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

ఖాళీ సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులు..

మహబూబాబాద్ జిల్లాలోని మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఆసక్తి, అర్హత గల విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 28 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ రూ.120 చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఏసీజీఈ మందుల శ్రీరాములు సెల్ నెంబర్ : 98497 61012ను సంప్రదించాలన్నారు.


పోలీస్ క్రీడామైదానంలో క్రీడాకారులతో కలిసి విజయసంకేతం చూపుతున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం క్రీడామైదానంలో కొనసాగుతున్న క్రీడలు బుధవారం నాటికి రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ క్రీడల్లో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితోఉండే పోలీస్ అధికారులకు క్రీడాపోటీలు నిర్వహించడం వలన ప్రశాంతతను పొందుతారని పేర్కొన్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, చెస్, క్యారమ్, పరుగుపందెం పోటీల్లో పోలీస్ అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకొని, ముందుకు సాగాలని సూచించారు.

పట్టపగలు నడిరోడ్డుపై దారుణ హత్య

- ఆటో డ్రైవర్‌పై కత్తితో మరో ఆటో డ్రైవర్ దాడి
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఘాతుకం
- హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో ఘటన

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలు.. మిట్ట మధ్యాహ్నం.. నగరం నడిబొడ్డు.. తీవ్ర జన సంచారం.. వాహనాల రాకపోకలతో బిజీగా ఉన్న ప్రధాన రహదారిపై ఓ ఆటో డ్రైవర్‌ను మరో ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘాతుకంతో అక్కడున్నవారు భయాందోళనకు గురయ్యారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో జరిగింది. ఈ దారుణహత్యకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కాజీపేట మండలం మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్ (45) స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. ఆటో నడుపుకుంటూ రాజ్‌కుమార్ జీవిస్తున్నారు. అలాగే మడికొండ అయోధ్యపురానికి చెందిన ఆటో డ్రైవర్ ఈనుగు వెంకటేశ్వర్లుకు వివాహమైంది. అయితే వెంకటేశ్వర్లుకు ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో కొన్నిరోజులుగా వివాహేతర సంబంధం ఉంది. కాగా, అదే మహిళతో రాజ్‌కుమార్ ఇటీవల సన్నిహితంగా ఉంటున్నాడు. ఇది గమనించిన వెంకటేశ్వర్లు రాజ్‌కుమార్‌పై కక్ష పెంచుకున్నాడు. మహిళ జోలికి రావొద్దని పలుమార్లు రాజ్‌కుమార్‌ను వెంకటేశ్వర్లు హెచ్చరించాడు. ఇదే విషయమై కొన్నిసార్లు గొడవపడ్డారు. ఈ క్రమంలో సదరు మహిళ వెంకటేశ్వర్లును దూరం పెట్టింది. దీంతో ఇద్దరిపై వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో రాజ్‌కుమార్ ఆటోను, వెంకటేశ్వర్లు తన ఆటోతో వెంబడించి గొడవకు దిగాడు. ఇద్దరికి మాటామాటా పెరిగి వెంకటేశ్వర్లు తన ఆటోలో ఉన్న కత్తితో రాజ్‌కుమార్‌పై దాడి చేశాడు. రాజ్‌కుమార్ కిందపడిపోగానే కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. అక్కడ ఉన్న స్థానికులు కత్తితో దాడి చేసిన వెంకటేశ్వర్లును అడ్డుకుని దేహశుద్ధి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను సుబేదారి పోలీసులు ఎంజీఎంకు తరలించగా అప్పటికే రాజ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాడి జరిగిన ప్రాంతానికి సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి, ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేరుకొని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాగా, సీసీ కెమెరాల్లో దాడి ఘటన రికార్డు కావడంతో పోలీసులు పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.



రాజ్‌కుమార్‌పై కత్తితో దాడి చేస్తున్న వెంకటేశ్వర్లు (తెల్ల చొక్కా)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజల సొమ్మును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు సైబర్ నేరగాళ్లు కొంతపంథాలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీం, పిరమిడ్, బిట్‌కాయిన్, వీక్స్ కాయిన్, యాబిట్‌కాయిన్, యూరిక్స్ కాయిన్ లాంటి స్కీముల ద్వారా ప్రజల నుంచి డబ్బులను దోచుకుంటున్నట్లు చెప్పారు. మొబైల్ లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం అయిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ట్విట్టర్ అకౌంట్ ఉన్న వినియోగదారులకు వివిధ రకాల లింకులను పెడుతున్నారని, వాటిని క్లిక్‌చేసి తమ బ్యాంకు ఖాతాఖాళీ చేసుకోవద్దని హెచ్చరించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఆ యాప్‌ల్లో జాయిన్ అయి ఎక్కువ పెట్టుబడులు పెట్టాక ఒకేసారి కంపెనీని ఎత్తివేస్తున్నారని చెప్పారు. అలాంటి ఫేక్ సోషల్ మీడియా ప్రకటనలను నమ్మొద్దని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాలను జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ శ్రీనివాస్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బాధితులను వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌ను కలిసేలా చేసి సంబంధిత బ్యాంకు వారితో మాట్లాడి అకౌంట్‌ను హోల్డింగ్‌లో ఉంచడం, గ్రామాల్లో సైబర్ వారియర్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సైబర్ మోసపోతే టోల్ ఫ్రీనెంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు.

కేయూలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేయూలో యువతకు నిర్వహించే రెండు రోజుల శిక్షణకు ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ బుధవారం తెలిపారు. నెహ్రూ యువకేంద్రం వరంగల్- యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 25, 26న మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 29 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి, రవాణ ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహబూబాబాద్ జిల్లా యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల యువకులు హనుమకొండ బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈనెల 24 మధ్యాహ్నం 2 గంటలలోపు సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 0870-2958776ను సంప్రదించాలన్నారు.

ఇద్దరు ఫారెస్టు ఉద్యోగుల సస్పెన్షన్

కాకతీయఖని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ డివిజన్ పరిధి పెగడపెల్లి రేంజ్‌లో పనిచేస్తున్న ఇద్దరు అటవీశాఖ ఉద్యోగులు సస్పెండ్ అయినట్లు సమాచారం. బొర్లగూడెంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు ఇద్దరు బీట్ అధికారులపై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు సమాచారం. అలాగే పెగడపెల్లి డీఆర్‌వో సస్పెన్షన్‌కు సీసీఎఫ్‌కు నివేదిక పంపినట్టు తెలిసింది. ఈ విషయమై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

కోటంచలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఉదయం సుదర్శన నారసింహహోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యులు, ఈవో మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏజెన్సీ మండల అభివృద్ధికి కృషి చేస్తా

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మురళీనాయక్

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గూడూరు ఏజెన్సీ మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గాజులగట్టులో హెల్త్ సబ్‌సెంటర్ ప్రహరీ నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వెంగంపేటలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణకోసం శంకుస్థాపన చేశారు. మదనాపురంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోడ సక్రు అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎర్రకుంట తండాలో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులతో అధికారులు అక్కడక్కడ కుమ్మక్కవుతున్నారని ఆరోపించారు. మండలంలో బీఆర్ఎస్ నాయకులతో అధికారులు కుమ్మక్కై వారి చెప్పిన విధంగా సర్వే నిర్వహించి అనర్హులను ఎంపిక చేశారని తనకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అధికారులు తిరిగి మళ్లీ సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించాలన్నారు. తప్పుడు సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ కోమల, ప్రత్యేక అధికారులు సారంగపాణి, సత్యనారాయణ, లవారం, దినేష్, రాంబాబు, హేమంత్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, బీరం శ్రీపాల్‌రెడ్డి, ఎడ్ల నరేష్‌రెడ్డి, బొల్లికొండ మధు, చంటిస్వామి, మాజీ సర్పంచ్ పడిగే వసంత, భట్టు రమేష్, ఎలకట్టె కార్తీక్ పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి, రాష్ట్ర సమితి సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర రావు అన్నారు. బుధవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాయుధపోరాట నేత తీగల సత్యనారాయణ రావు విగ్రహావిష్కరణ ఈ నెల 25న మహబూబాబాద్‌లో జరుగుతుందన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వంద సంవత్సరాలుగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. ఎన్నో పోరాటాల ఫలితంగానే నేడు ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సాయుధ పోరాట నేత తీగల సత్యనారాయణ రావు పోరాటాల ఫలితంగా నాటి మానుకోట డివిజన్‌తో పాటు ఈ ప్రాంతంలో అనేక సమస్యల కోసం ఆయన నిరంతర పోరాటం చేశాడన్నారు. పార్టీ నిర్మాణం కోసం పాటుపడిన కార్యకర్తలను ఎప్పటికి మర్చిపోదన్నారు. సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకులు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి మహేందర్, కిరణ్, యాదగిరి, శ్యామ్, లక్ష్మణ్, వెంకన్న, ఎల్లయ్య, నర్సింహరెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

డీటీఎఫ్ టీచర్స్ కమిటీ ఎన్నిక

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ బుధారపు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తొర్రూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధ్యక్షుడిగా పులిపాటి తిరుమలేష్, ప్రధాన కార్య దర్శిగా బొమ్మెర కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.రవీందర్, కె.స్వప్నతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల, దర్గయ్య, కుమార స్వామి, రవీందర్, వెంకటాచారి, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కార్యదర్శి చేతివాటం

- డబ్బులు వసూలు చేశారంటూ ప్రజల ఆరోపణ
- గ్రామసభలో తహసీల్దార్‌కు గ్రామస్థుల వినతి
- నెల రోజు కిందటే ఆంధ్రజ్యోతిలో కథనం


ప్రత్యేకాధికారికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

కొత్తగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పంచాయతీ కార్యదర్శి చేతివాటం ప్రదర్శించారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.15వందల నుంచి రూ.20 వేలు వసూలు చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం చెరువుముందు తండాలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు మూకుమ్మడిగా జీపీ కార్యదర్శిపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఇళ్ల సర్వేలో ఒక్కొక్కరి నుంచి రూ.1500 నుంచి రూ.2000 వసూలు చేసిందని ఆరోపిస్తూ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి అవినీతి బయట పడింది.

కాగా, పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి వసూళ్ల పర్వంపై డిసెంబరు 23న ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. సర్వేలో భాగంగా ఆమె ఇంటికి రూ.1500 నుంచి 2000 చొప్పున డబ్బులు చేసిన విషయమై గ్రామస్తుల ఆరోపణలతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కానీ అధికారులు విచారణ చేయకుండా, చర్యలు తీసుకోకుండా ఉదాసీనత పాటించారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన గ్రామసభలో ప్రజలు కార్యదర్శి నిర్వాకంపై అధికారులను ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కార్యదర్శి జ్ఞానేశ్వరిపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అలుపెరుగని యాత్రికుడు

- స్వేచ్ఛ భారత్‌ను కాంక్షిస్తూ యువకుడి సైకిల్ యాత్ర
- ఉత్తరాఖండ్ నుంచి మొదలైన ప్రయాణం

వాజేడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ భారత్ కోసం ఆ యువకుడు పరితపిస్తున్నాడు. 'క్లీన్ ఇండియా.. గ్రీన్ ఇండియా' నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టాడు. ఉత్తరాఖండ్ నుంచి బయల్దేరి దేశ పర్యటన చేస్తున్నాడు. రోజుకు 100 కిలో మీటర్ల ప్రయాణం చేస్తూ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అయిన ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామానికి బుధవారం చేరుకున్నాడు. ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన 29 ఏళ్ల రవికాంత్ గిల్బా సైకిల్ యాత్ర చేపట్టాడు. 53 రోజులుగా ఆయన భారత్ యాత్ర పేరుతో దేశమంతటా చుట్టుముడుతున్నాడు. ఇప్పటి వరకు 5,900 కిలోమీటర్లు పర్యటించాడు. తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లాడు. తన గమ్యస్థానం జమ్మూకశ్మీర్ అని, మరో 80 రోజుల్లో అక్కడికి చేరుకుంటానని చెప్పాడు. మరో 9 వేల కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేయాల్సి ఉందని తెలిపాడు. ఉత్తరాఖండ్ నుంచి ఇప్పటి వరకు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మీదుగా తన ప్రయాణం సాగిందని పేర్కొన్నాడు. పెట్రోల్ బంకుల వద్ద నిద్రిస్తూ ఎవరైనా ఇచ్చిన ఆహారాన్ని తీసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపాడు.


సైకిల్ యాత్ర చేస్తున్న రవికాంత్ గిల్బా

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2535	2160
పల్లికాయ (సూక)	6200	5600
పల్లికాయ (పచ్చిది)	4300	4100
కందులు	6382	5560
పెసళ్లు	2852	2800
పత్తి	7210	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	12111	10234
పసుపు (గోల)	12011	10121
తేజ మిర్చి	14600	9000
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్ 341ఏసీ	13500	12300
యూఎస్ 341	15500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం


సంకీర్తనలో పాటలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు

హరినామ సంకీర్తనలో తాడిచర్ల వాసులు

మల్హర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనే అవకాశం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి వెంకటేశ్వరస్వామి భజన మండలి సభ్యులకు దక్కింది. మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లిన వారు శ్రీహరి పాదాల చెంత అఖండ హరి నామ సంకీర్తనలో పాల్గొన్న వారిలో యెల్లగొరి శ్రీనివాస్, ఓజల రాజబాబుతో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

జాతీయస్థాయి మెంటార్‌గా రామయ్య



ములుగు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని అబ్బాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ కందాల రామయ్య జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి జాతీయ మెంటార్ మిషన్ (ఎన్‌సీటీఈ)గా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ వృత్తి, అభివృద్ధి కోసం ఆయన చేసిన విశేష కృషి, భారతదేశంలో విద్యా నాణ్యతను మెరుగు పరిచేందుకు చేసిన కృషికి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు దక్కింది. ఈమేరకు రామయ్య జాతీయ మెంటార్‌షిప్ పూల్‌లో చేరేందుకు ఎన్‌సీటీఈ, జాతీయ మెంటారింగ్ కన్వీనర్ డాక్టర్ దినేష్‌కుమార్ ఈ-మెయిల్ ద్వారా బుధవారం ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా రామయ్యను జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కె.మల్లారెడ్డి, అబ్బాపురం జడ్పీ హెచ్ఎం జి.భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రామప్పను దర్శించిన ఫ్రాన్స్ దేశస్థులు

వెంకటాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని ఫ్రాన్స్ దేశానికి చెందిన వృద్ధ దంపతులు జూర్లీ, అని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సందను వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.


శిల్పకళా సంపదను వీక్షిస్తున్న ఫ్రాన్స్ దేశస్థులు

తమిళనాడులో సరస్వతి విగ్రహం తయారీ

ప్రత్యేక పూజలు చేసిన కాళేశ్వరాలయ స్థపతి, ఈవో


విగ్రహాన్ని తయారు చేయనున్న శిలకు పూజ చేస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న సరస్వతీదేవి విగ్రహం తమిళనాడులోని మహాబలిపురంలో తయారవుతోంది. ఈ క్రమంలో బుధవారం అక్కడికి వెళ్లిన దేవాదాయ శాఖ స్థపతి వల్లి నాయుగం, కార్యనిర్వహణాధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ అసిస్టెంట్ స్థపతి గణేష్ విగ్రహ తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ వనజ

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ బాలికల, జూనియర్ కళాశాల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సర ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ వనజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 79950 57928 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఓవర్ లోడ్ ఇసుక లారీల సీజ్

మల్హర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక లారీలను సీజ్ చేసినట్లు భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి సమ్మానీ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని నాగులమ్మ క్రాస్ వద్ద ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న లారీలను కొయ్యూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఉంచినట్లు చెప్పారు. పరిమితికి మించిన లోడ్‌తో రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

చిన్న జాతరకు చక చకా..

ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారం మినీ సంబురం

- 40లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా
- సౌకర్యాల కల్పనకు రూ.5.33కోట్లు మంజూరు
- పలుశాఖల ఆధ్వర్యంలో పనులు ప్రారంభం

తాడ్వాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేడారం మినీ జాతరకు సమయం సమీపిస్తోంది. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 15వతేదీ వరకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే సమ్మక్క సారలమ్మల మినీ జాతరకు పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ జాతరకు సుమారు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో జాతర నిర్వహణతో పాటు, బయ్యక్కపేట, కొండాయి, పునుగొండ్ల, ఐలాపూర్, తదితర చిన్న జాతరల నిర్వహణల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.5.33కోట్ల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. అలాగే పలు శాఖల ఆధ్వర్యంలో అధికారులు ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు.


పలు శాఖల ఆధ్వర్యంలో పనులు

గిరిజన సంక్షేమం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.1.12కోట్లు వెచ్చించి ఐటీడీఏ, రెవెన్యూ మూడు అతిథి గృహాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, 2020లో కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న భక్తుల వసతి భవనాల్లో నీటి వసతి, పారిశుధ్యం, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, పలు అభివృద్ధిపనులు, 2018లో నిర్మించిన 27 షాపింగ్ కాంప్లెక్స్‌లలో మరమ్మతు పనులు, పారిశుధ్య కార్మికుల వసతి షెడ్లలో మరమ్మతుల కోసం, బయ్యక్కపేట వనదేవతల జాతర నిర్వాహణ సౌకర్యాలు, ఐలాపూర్ జాతరలో నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, నీటి సరఫరా కోసం కొత్త బోరు, మోటార్ ఏర్పాటు, కొండాయి గ్రామంలో ఉన్న ఆర్చికి పెయింటింగ్, జాతర పరిసరాల్లో కాంపౌండ్‌వాల్ పనులను చేపట్టనున్నారు.

- గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ. 1.47 కోట్లు వెచ్చించారు. వాటితో మేడారంలో పూజారుల అతిథి భవనానికి సీసీ రోడ్డు, భవనం చుట్టూ ప్రహరీ, వంట షెడ్ నిర్మాణం, చిలకలగుట్ట రోడ్ నుంచి సమ్మక్క గుడి వరకు నూతన సీసీ రోడ్ నిర్మాణం, కన్నెపెల్లి సారలమ్మ గుడి వద్ద పూజారుల వసతి ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల ఏర్పాట్లు, బయ్యక్కపేట గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి తాళ్లతోగు వరకు నూతన సీసీ రోడ్‌తోపాటు మట్టి రోడ్ నిర్మాణం, పునుగొండ్ల గ్రామంలో పగిడిద్దరాజు గుడి వద్ద భూమి చదును పనులు, మహబూబబాద్ జిల్లాలోని గంగారం గ్రామంలోని పగిడిద్దరాజు గుడి వద్ద సీసీ రోడ్ నిర్మాణం చేయనున్నారు.
- నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 12.90లక్షల నిధులను వెచ్చించి మినీ జాతర నిర్వహణకు పనులను చేపట్టనున్నారు.
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 18.83లక్షల నిధులను వెచ్చించి ఊరట్టం నుంచి కొండాయి, కొండాయి నుంచి ఐలాపూర్, బయ్యక్కపేట నుంచి కాల్వపల్లి, కాల్వపల్లి నుంచి కన్నెపెల్లి వరకు మట్టి రోడ్ల మరమ్మతులు, బయ్యక్కపేట జాతర నిర్వహణ పనులను చేపట్టారు. అలాగే గద్దెలకు అతి సమీపంలోని 21 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నారు.
- మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి జంపన్నవాగు, శివరాం సాగర్ చెరువు లోతట్టు ప్రాంతంలో గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయనున్నారు.
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ. 42లక్షల నిధులను వెచ్చించి మేడారం పరిసరాల్లో 100 కేవీ పది డీటీఆర్‌లు, 3/5 వైరు లైన్లు, స్పేసర్‌లు, డీటీఆర్‌ల చుట్టు ఫెన్సింగ్, విద్యుత్ సిబ్బంది కోసం వసతి పనులను చేపట్టారు.
- జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆధ్వర్యంలో రూ. 81.52 లక్షల నిధులతో జాతర పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. అందుకు పారిశుధ్య కార్మికులు, ఆదునిక యంత్రాలు, ట్రాక్టర్లు, డోజర్లు, ఎక్స్‌కవేటర్లు, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్, ఈగలు, దోమలు ప్రబలకుండా లీయోబ యోలిక్ రసాయనాల పిచికారీ ఏర్పాట్ల పనులను చేపట్టారు.
- పౌర సమాచారశాఖ ఆధ్వర్యంలో రూ.4.50లక్షలు వెచ్చించి జాతర పరిసరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భోజన వసతులు, రవాణా సౌకర్యం, జాతర సన్నివేశాలను వీడియో, ఫొటోలు తీయడం లాంటివి ఏర్పాటు చేయనున్నారు.
- మిషన్ భగీరథ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 24.70లక్షల నిధులతో తాగునీరు, పైపులైన్లు, నల్లాల ఏర్పాట్లు, నీటి సరఫరా, చేతిపంపుల మరమ్మతులు, బోరుబావుల శుద్ధి, జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత పనులను చేపట్టనున్నారు.
- అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.80లక్షల నిధులను వెచ్చించి వన్యప్రాణుల సంరక్షణ, ఫైర్‌సేఫ్టీల ఏర్పాటు, అటవీ సంరక్షణ, మట్టి రోడ్ల అనుమతుల పనులను చేపట్టారు.
- డీడబ్ల్యూవో, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడం, నాలుగు ప్రకటన కేంద్రాలు, తప్పిపోయిన వారి కోసం వసతి కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కాగా పోలీసు, వైద్య, దేవాదాయశాఖ, రెవెన్యూ, ఎక్సైజ్, ఆర్టీసీ, పలు శాఖలకు కూడా నిధులు కేటాయించి మినీ జాతర ఏర్పాట్లను చేపడుతున్నారు.


ట్రాక్టర్లలో చెత్త తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది


మేడారం పరిసరాలలో డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది


ములుగులో కమ్మేసిన పొగమంచు

కమ్మేసిన పొగమంచు

- రహదారులపై రాకపోకలకు అంతరాయం
- పలు రైళ్లను వేగం తగ్గించి నడిపిన అధికారులు

ములుగు / కేసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కమ్మేసింది. బుధవారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో రహదారులపై వాహ నాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం 9గంటలు దాటినా మంచు వదలకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, రోజు వారీ పనులకు వెళ్లే కార్మికులు, రైతులు ఆ మంచులోనే ముందుకు కదిలారు. బుధవారం ములుగులో ఈ సీజన్‌లో తొలిసారి ఇంతటి స్థాయిలో మంచు కురిసిందని ప్రజలు చర్చించుకున్నారు. ఇక రైళ్ల రాకపోకలు కూడా కాస్త నెమ్మదిగానే జరిగాయి. తెల్లవారుజామున సమయంలో పొగమంచు కారణంగా మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్, కాజీపేట మీదుగా వెళ్లిన పలు రైళ్లను వేగం తగ్గించి నడిపారు. మహబూబాబాద్ జిల్లా కేస ముద్రంలె వాతావరణంలో తేమ శాతం 96 చూపింది. రైల్వేట్రాక్‌పై వెళుతున్న రైళ్ల దగ్గరకు వచ్చేంత వరకు ఫ్లాట్‌ఫాంపై ఉన్న ప్రానికులకు కనిపించలేదు. ట్రాక్‌ను నిరంతరం పర్యవేక్షించే కీమెన్లు ఇచ్చే పొగమంచు సమాచారం ఆధారంగా ప్యాసింజర్ రైళ్లను కొంత వేగాన్ని తగ్గించి, లాంగ్ హారన్ ఇస్తూ నడిపినట్టు సిబ్బంది తెలిపారు.


ఇనుగుర్తిలో ఉదయం 8.30కు ఇలా..


కేసముద్రం రైల్వేస్టేషన్‌లో కమ్ముకున్న పొగమంచు

అరచేతిలో అపురూపం

నగర సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే వరంగల్ మహానగరంలోని పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెన్లు, కళారూపాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఎంజీఎం కూడలి వద్ద ఏర్పాటు చేసిన అరచేతిలో శిశువు కళారూపం నగర అందాలను రెట్టింపు చేస్తోంది.





ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో ముందస్తు మొక్కులు

తాడ్వాయి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో వన దేవతల దర్శనానికి బుధవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోరికలు తీరాలని ఎత్తు బంగారం, యా టలతో మొక్కులు చెల్లించారు. జంపన్న వాగులో పుణ్య స్నానాల అనంతరం వనదేవతలైన సమ్మక్క-సారలమ్మల వద్దకు నడుచుకుంటూ వెళ్లి చీరె, సారె, పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం సమర్పించుకున్నారు. సుమారు 15వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.

ఏకాగ్రతే విజయానికి సోపానం

- తల్లిదండ్రులు, గురువులకు రుణపడి ఉండాలి
- విషయ పరిజ్ఞానం లేని విద్య నిరుపయోగం
- ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి
- వరంగల్‌లో ముగిసిన సాఫల్య-2025 నైపుణ్య శిక్షణ తరగతులు

కరీమాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో చదివితే ప్రతీ విద్యార్థి విజయం సాధిస్తాడని ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. బుధవారం వరంగల్ ఉర్సు గుట్ట వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో టెన్త్ విద్యార్థుల కోసం వడుప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫల్య-2025 (నైపుణ్య శిక్షణ తరగతులు) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విషయ పరిజ్ఞానం లేని విద్యతో ప్రయోజనం లేదని, కేవలం మార్కుల కోసం వెంపర్లాడకుండా పాఠంలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు, గురువులకు రుణపడి ఉండాలని, మీపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కలలను సాకారం చేయాలని ఉపదేశించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వడుప్సా బాధ్యులకు, తల్లిదండ్రులకు మంగళశాసనాలు అందజేశారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పూర్తి సమయాన్ని చదువుపై పెట్టి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రజ్ఞావికాస్ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఓరియెంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, స్వామీజీ ఆశీస్సులతో వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌ల బోధనలను అర్థం చేసుకోవాలని, అదేవిధంగా స్వామీజీ సూచనలు పాటించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. వడుప్సా ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వడుప్సా(ట్రస్మా) బాధ్యులు అంకటి వీరస్వామి, బిల్ల రవి, ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, సతీష్, కోడెం శ్రీధర్, చక్రపాణి, రాజు, కిరణ్, వెంట్రాజం, కాంత్రికుమార్, సతీష్‌మూర్తి, ప్రవీణ్, శ్రీనివాస్, మోహన్, రవి, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, శరత్‌బాబు, ప్రసాద్, శ్రీనుబాబు, భాస్కర్, కృష్ణాకర్, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామీజీ

30న కళాకారుల శోభాయాత్ర

- చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహణ
- వికాస తరంగిణి చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ

హనుమకొండ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు వందలాది మంది కళాకారులచే శోభయాత్ర నిర్వహించేందుకు విస్తృత చేస్తున్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పెద్ద ఎత్తున జరిగే కళాకారుల శోభయాత్రలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి భజన, హరికథ, యక్షగాన, చిందు, కోలాటం లాంటి వివిధ కళా రూపాలతో వందలాది మంది కళాకారులు శోభయాత్రలో పాల్గొననున్నారు. భక్తిమార్గంలో పయనిస్తున్న వివిధ సంప్రదాయాలకు చెందిన కళారూపాలను పరిరక్షించుకోవడం ప్రధాన ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. చిన్నజీయర్‌స్వామి ఆలోచనకు ప్రతిరూపంగా కళలకు కాణాచిగా వెలుగొందుతున్న ఓరుగల్లులో పెద్ద ఎత్తున నిర్వహించాలని జీయర్‌స్వామి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తాము ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల వికాస తరంగిణి చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ చెప్పారు. దార్శనికత వెలుగులో నిర్మాణం అవుతున్న హైందవ భక్తి కళామార్గమే తమ వికాస తరంగిణి ఆధ్వర్యంలో సంకీర్తన మండలి అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళారూపాలను ప్రదర్శించే కళాకారులతోపాటు గురువులను ప్రోత్సహిస్తూ గౌరవించడం, భక్తి కళాసంఘాలను ఏర్పర్చి సంఘటితం చేయడం, భక్తి కళాసంఘాల ద్వారా హిందు ధార్మిక విలువలను విస్తరింపజేసే లక్ష్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాధాకృష్ణ చెప్పారు. ఇందుకుగాను రెండు నెలలుగా ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో నిక్షిప్తమైన కళారూపాలను ప్రదర్శించే కళాకారులతో స్వయంగా అనేక సమావేశాలు నిర్వహించి వారిని ఈ కార్యక్రమానికి సమాయత్తం చేశామన్నారు. భూపాలపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి కళాకారులు తరలివస్తారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో కళారూపాలను ప్రదర్శించే గ్రూప్ టీం లీడర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారికి మార్గదర్శనం చేశామన్నారు. ఒకవైపు భక్తి కళా సంఘాల ద్వారా సామాజిక సేవలను కూడా ప్రోత్సహింపజేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్నిరకాల కళారూపాలు ఒకేచోట శోభాయాత్ర ద్వారా నగర వాసులను కనువిందు చేసి భక్తి మార్గంలో ఓలలాండింపజేసే కార్యక్రమంలో అన్నిరంగాల కళాకారులు, కళాభిమానులు, ధార్మిక చైతన్యం కలిగిన వారు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


చిన్నజీయర్‌స్వామి

శివ శివా.. ఏమిటిదీ?

- గాడి తప్పుతున్న కాళేశ్వరాలయ వ్యవస్థపై భక్తుల్లో అసహనం
- గర్భగుడిలో షూటింగా..? మహా పాపమంటున్న భక్తులు
- కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలంటూ డిమాండ్

మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'సాక్షాత్తూ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సాక్షిగా గర్భగుడిలో ఓ ఆల్బమ్ చిత్రీకరణ కోసం తలుపులు మూసి షూటింగ్ చేయడమా..? ఇది ఎంతవరకు సమంజసం.. దీనికి ఎవరు బాధ్యులు? ఎవరు బాధితులు? అంతా అయిపోయాక ఏమంటే ఏముంది?' అని భక్తురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాదిన వెలిసిన త్రిలింగాలలో ఒకటిగా విరాజిల్లుతున్న పుణ్యక్షేత్రం కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయ పాలనపై అసహనం వ్యక్తమవుతోంది. కొందరు అధికారుల పట్టింపులేని తనం.. అర్చకుల చేతివాటంతో ఆలయ ప్రతిష్ఠకు భంగం కలుగుతోంది. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలం దక్షిణ కాశీగా పేరు ప్రఖ్యాతలు పేరుగాంచిన త్రిలింగ క్షేత్రాలలో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ గర్భగుడిలో సోమవారం ప్రైవేటు ఆల్బమ్ కోసం తలుపులను బంద్ చేసి ఆలయంలో రెండు లింగాల వద్ద ప్రైవేటు వ్యక్తులు షూటింగ్‌ను నిర్వహించారు. దూర ప్రాంతల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. అయినప్పటికీ కూడా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, అర్చకులు భక్తులను పట్టించుకోకుండా ఆ పాటలోనే నిమగ్నమైపోయారు. దీంతో ఆలయ పవిత్రతను దెబ్బతీశారని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తయారై ఆలయ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. సమయం పాటించకుండా అర్చకులు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

పలువురిపై అనుమానాలు

ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో మహా కుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు తేదీలను ప్రకటించారు. 1972లో మహాకుంభాభిషేకాన్ని నిర్వహించగా దాదాపు 43 సంవత్సరాలకు మళ్లీ ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్నారు. మే15నుంచి సరస్వతి పుష్కరాల తేదీలను కూడా ప్రకటించారు. అయితే ఈ ఉత్సవాల నిర్వహణ పనుల నిమిత్తమై ఆలయ అధికారులు శృంగేరి పీఠాధిపతుల వద్దకు వెళ్లిన క్రమంలో గర్భగుడిలో అనుమతులు లేకున్నా అర్చకులు పాట చిత్రీకరించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామకృష్ణశర్మకు మెమోతో పాటు నోటీసులు అందజేశారు. దేవాదాయ శాఖ అధికారులు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, తాము అందుబాటులో లేమని, తమకు ఎవరూ సమాచారం ఇవ్వలేదని తెలిపారు.


ఆలయంలో ఆల్బం చిత్రీకరణ

ఎవరికి వారే..

దేవుడు వరమిచ్చినా పూజారి దర్శనభాగ్యం కల్పించని చందంగా ఇక్కడి అర్చకులు, సిబ్బంది తీరు ఉంది. కొద్ది నెలల నుంచి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు గ్రూపు రాజకీయాలుగా తయారై వేళాపాల లేకుండా ఆలయానికి చుట్టపుచూపుగా వస్తున్నారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఏమీ పట్టించుకోకపోవడంతో సిబ్బందిదో గ్రూపు, అర్చకులదో గ్రూపు తయారు కావడంతో ఆలయ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. గతంలో ఆలయంలో పనిచేసే ముగ్గురు అర్చక సిబ్బంది పదవీ విరమణ చేయడం, కొత్త అర్చకులను నియమించకపోవడంతో ఉన్న అర్చకులు సరైన సమయం పాటించకపోవడం, ప్రైవేటు అర్చకులకు ఆలయాన్ని అప్పజెప్పడం జరుగుతోంది. ఆలయంలో పనిచేస్తున్న రెగ్యులర్ అర్చకులు సొంత పనుల్లో నిమగ్నమైపోతున్నారు. అయినా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో నిత్యం 20 నుంచి 30 వేలు వచ్చే ఆదాయం ఇప్పుడు రూ.4 లక్షల వరకు ఆదాయం పెరిగినప్పటికి దీనికి రెగ్యూలర్ ఈవో లేకపోవడం ఆలయానికి శాపంగా మారింది . కాగా 2024 కు గాను రూ.5 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం.. ఆదాయం పెరిగే కొద్ది ఆలయ ప్రతిష్ఠను భంగపరుస్తున్నారని.. వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్య

గతంలో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ తక్కువగా ఉండడం, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాలను కలుపుతూ బ్రిడ్జిలు నిర్మాణం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకుంటున్నారు. కానీ భక్తులు వచ్చే సమాయానికి పూజారులు లేకపోతుండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళేశ్వరంలో కాల సర్పదోష నివారణ పూజలు, శని పూజలను నిర్వహించే బుధ, మంగళ వారాల్లో ఎక్కువగా రద్దీ ఉంటుంది. పెళ్లికాని యువతీ యువకులు, సంతానం లేని దంపతులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకుంటే వారి ఆకాంక్షలు నెరవేరుతున్నాయని నమ్ముతారు. ఇక తెలంగాణ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో రాష్ట్రంలోని నలుమూలల నుంచి కాళేశ్వరానికి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గ్రూపుల సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు మూకుమ్మడిగా వస్తున్నారు. దీంతో కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్‌లో జనం రద్దీ రోజురోజుకు పెరుగుతోంది.



తొర్రూరు మండలం పత్తేపురంలో దరఖాస్తును స్వీకరిస్తున్న అధికారులు


నర్సింహులపేట మండలం పెద్దనాగారం జీపీ ఎదుట బైఠాయించిన యువకులు


గాజులగట్టు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


పెద్దవంగర మండలం చిట్యాలలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

కొనసాగుతున్న గ్రామ, వార్డు సభలు

• రెండో రోజు వాగ్వాదాలు, నిలదీతలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అర్హుల జాబితా ఎంపిక కోసం బుధవారం రెండోరోజు గ్రామ, వార్డు సభలు కొనసాగాయి. జిల్లాలోని గ్రామాల్లో గ్రామసభలు, డోర్నకల్, మానుకోట, తొర్రూరు, మరిపెడ మునిసిపాలిటీల పరిధిల్లో వార్డు సభలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరిగాయి. సభల్లో అధికారులతో వాగ్వావాదాలు, నిలదీతలు కొనసాగాయి. సంక్షేమ పథకాలకు అర్హులైనప్పటికీ తమపేర్లు జాబితాల్లో లేవని ప్రజలుఅధికారులతో గొడవపడ్డారు. అర్హులను కాకుండా అనర్హులను ఎంపిక చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని అర్హతలుండి జాబితాలోపేరులేకుంటే మళ్లీ దరఖాస్తులే చేసుకోవాలని అధికారులు సూచించారు. సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని 4,9,16,23,33 వార్డుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 5,10,24,30,36 వార్డుల్లో అధికారులు సభలను నిర్వహించారు. కాగా, 24వవార్డు పరిధిలోని ఇందిరానగర్‌లో జరిగిన సభలో మునిసిపల్ వైస్‌చైర్మన్ వెంకన్న, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో ఇలా..

• మహబూబాబాద్ మండలం నడివాడ, ఉత్తరతండా, కంబాలపల్లి, సింగారం గ్రామాల్లో అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేర్లు రాకపోవడంతో ప్రజలు అధికారులను నిలదీశారు. దీంతో గ్రామసభల్లో కాసేపు ఉద్రికత్త నెలకొంది. ముడుపుగల్, అయోధ్య, ఇందిరానగర్‌కాలనీ, చిన్న కిష్టాపురం, గడ్డిగూడెం తండాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు భగవాన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

• మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని 2,6,10,14 వార్డుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక కోసం వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం మళ్లీ దరఖాస్తులు చేసుకున్నారు. ప్రజా పాలన దరఖాస్తులు బుట్ట దాఖలయ్యాయని అధికారులను ప్రశ్నించారు.

• చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో గ్రామసభ రసాభాసగా మారింది. అర్హులకు కాకుండా అనర్హులతో జాబితాలను సిద్ధం చేశారని అధికారులపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకన్న, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

• మరిపెడ మండలం కోట్యాతండా, వాల్యాతండా, ఏలివారిగూడెం, బీచ్‌రాజుపల్లిలో సభలు జరిగాయి.

• దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల, నిదానపురం, దుబ్బతండా గ్రామాల్లో సభలు జరిగాయి. తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో వివేక్‌రామ్, ఎంపీవో మహ్మద్ పాష పాల్గొన్నారు.

• నర్సింహులపేట మండలం పెద్దనాగారంలో అనర్హులకు సంక్షేమ పథకాలు కేటాయించడంపైగ్రామానికి చెందిన పలువురు యువకులు జీపీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కౌంసల్యదేవిపల్లి, రామన్నగూడెం, పెద్ద నాగారం, పడమటి గూడెం, గ్యామా తండాల్లోసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అనర్హులపేర్లు జాబితాలో ఉండడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

• తొర్రూరు మునిసిల్ పరిధిలోని 2,6,10 వార్డుల్లో సభలను నిర్వహించారు. చైర్మన్ రాంచంద్రయ్య, వైస్‌చైర్మన్ సురేందర్‌రెడ్డి, కమిషనర్ శాంతి కుమార్, కౌన్సిలర్ తూలం రోజాప్రభు పాల్గొన్నారు.

• తొర్రూరు మండలం పత్తేపురం, నాంచారి మడూరు, టీక్యాతండా, గోపాలగిరి తదితర గ్రామాల్లో సభలు నిర్వహించారు. నాంచారిమడూరు, టీక్యాతండాల్లో అనర్హుల పేర్లు జాబితాలో చదివారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, డీఏవో వినోద్‌కుమార్, ఏవో భాస్కర్,ఎంపీడీవో వేణుమాధవ్, ఎంపీవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

• కేసముద్రం మండలం తౌర్యాతండా గ్రామ సభలో సర్వే జాబితా చదువుతుండగా పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ పైకి పలువురు గ్రామస్థులు దూసుకువెళ్లి దూషించి టెబుల్‌పై ఉన్న జాబితా పేపర్లను లాక్కున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కార్యదర్శి తెలిపారు. మిగతా గ్రామాల్లో అనర్హులకు జాబితాలో చోటు దక్కిందని అర్హులను విస్మరించారని నిరసనలు వ్యక్తం చేశారు.

• నెల్లికుదురు మండలం రామన్నగూడెం, పార్వతమ్మ గూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, నైనాల్లో గ్రామ సభలు జరిగాయి.

• డోర్నకల్ మునిసిపల్ పరిధిలోని 2,9,13,4 వార్డుల్లో నిర్వహించిన సభల్లో మునిసిపల్ చైర్మన్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కౌన్సిలర్లు అశోక్, వీరన్న, శరత్‌బాబు పాల్గొన్నారు. మండలంలోని ఫకీరాతండా, బూర్గుపాడు, కొత్త దుబ్బతండా, పాతదుబ్బతండా, చిలుకోడు, చాంప్ల, రాముతండాల్లో గ్రామ సభలు నిర్వహించగా తహసీల్దార్ కృష్ణవేణి, అధికారులు శ్రీనివాసరావు, నర్సింహామూర్తి, మున్వర బేగ్ పాల్గొన్నారు.

• సీరోలు మండల కేంద్రంతో పాటు తాళ్లసంకీస, వస్రాం తండా, కొత్తూరు(సీ), కొర్లకుంట తండాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో కురవి ఎంపీడీవో వీరబాబు, సీరోలు తహసీల్దార్ శారద, ఏవో చాయరాజ్, యాకూబ్‌పాష, రమేష్, మల్సూరు, భరత్, సురేష్ పాల్గొన్నారు.

• కొత్తగూడ మండలం బత్తులపల్లి, చెరువుముందు తండా, గుంజేడు, కొత్తగూడ, ఓటాయి, రేణ్యతండా, పొగుళ్లపల్లి, దుర్గారాం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

• గంగారం మండలం జంగాలపల్లి గ్రామ సభలో అధికారులపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా ఉద్యోగులకు, కాంగ్రెస్ నేతలు పైరవీలు చేసిన అనర్హులకు ఇళ్ల జాబితాలో చోటు కల్పించారని మండి పడడంతో సభ రసాభాసగా మారింది.

• గార్ల మండలంలోని సీతంపేట, పుల్లూరు, రాంపురంల్లో గ్రామ సభలు జరిగాయి. రాంపురం, సీతంపేటల్లో అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు కాలేదని అధికారులపై ప్రజలు మండిపడ్డారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన వారికే రేషన్‌కార్డులు ఇచ్చారని ప్రజలు తమ నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మంగమ్మ, డీటీ సుధాకర్‌నాయక్, ఏవో రామారావు పాల్గొన్నారు.

• ఇనుగుర్తి మండలం మీట్యాతండా, పెద్దతండా, పాతతండా, తారాసింగ్ తండాల్లో గ్రామసభలు నిర్వ హించారు.

• కురవి మండలం అయ్యగారిపల్లి, కంచర్లగూడెం, రాజోలు, హరిదాసుతండా, ఎలకచెట్టు తండా, నేరడ, జూజూరు తండా, బేగావత్‌తండా, కొత్తూరు(జీ), రేకుల తండాల్లో గ్రామ సభలు నిర్వహించారు. అయ్యగారిపల్లిలో అర్హులకు జాబితాలో చోటు దక్కలేదని సీపీఐ మండల సహాయకార్యదర్శి బుర్ర సమ్మయ్య అధికారులతో వాగ్వావాదానికి దిగారు. ఆయా గ్రామ సభల్లో తహసీల్దార్ సునిల్‌రెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

• పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి, చిట్యాల, గట్లకుంటలో గ్రామ సభల్లో అనర్హుల పేర్లు జాబితాలో చేర్చారంటూ ప్రజలు అధికారులను నిలదీశారు.

• గూడూరు మండలం గాజుల గట్టు, వెంగంపేట, ఎర్రకుంట తండాల్లో గ్రామ సభల్లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులువీరస్వామి, శ్వేత పాల్గొన్నారు.

•బయ్యారం మండలం గౌరారం, బాల్యతండా, చర్లపల్లి, అల్లిగూడెం, జగత్‌రావుపేట, మొట్ల తిమ్మాపురం, రాంచంద్రాపురం, జగ్గుతండాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు లింగరాజు, సువర్చల, దేవేంద్రాచారి, లక్ష్మణ్‌రావు, లక్ష్మి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో మళ్లీ సర్వే నిర్వహించాలి'


ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఎంసీపీఐ నాయకులు

కేసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులను అందజేయాలని కోరుతూ ఎంసీపీఐమండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ గ్రామసభల్లో చదువుతున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనేక మంది అనర్హులు ఉంటున్నారని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అనేకమంది ఉపాధి హామీ కూలీల పేర్లు రాలేదని, గ్రామాల్లో మళ్లీ సమగ్రంగా సర్వే నిర్వహించి అర్హులను జాబితాలో చేర్చాలని కోరారు. పార్టీ నాయకులు జాటోత్ బిచ్యానాయక్, బొల్లోజు సత్యనారాయణ, దయ్యాల కుమారస్వామి, జి.రవీనా, రాంజీ, ఉల్లి ప్రతాప్, నరేష్, గుండెల కుమార్, ఉల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఢిల్లీ రైతుల పోరాట దీక్ష దినాన్ని సక్సెస్ చేయండి


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో రైతుల పోరాట దీక్ష దినాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం స్మారక భవనంలో బుధవారం ఎస్‌కెఎం నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 26న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ట్రాక్టర్‌మార్చ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో రైతులు చేస్తున్న దీక్షకు సంఘీభావంగా ట్రాక్టర్ మార్చ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. నాయకులు గుజ్జు దేవేందర్, బండారు ఐలయ్య, నల్లపు సుధాకర్, మేక వీరన్న, అలువాల వీరన్న పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో చోరీ

డోర్నకల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్రాలకుంట గ్రామపంచాయతీ పరిధిలోని టేకులతండాలోనిశ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తండావాసులు తెలిపారు. అభయాంజనేయస్వామికి చెందిన వెండి గద, కడియాలు చోరీకి గురైనట్లు వారు తెలిపారు. ఈ విషయమై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కీలక పాత్ర'


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

డోర్నకల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. డోర్నకల్ మండలంలోని మోడల్‌స్కూల్, జడ్పీ హైస్కూల్లో, మైనార్టీ పాఠశాలలో బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హెల్త్‌కార్డులు, పెండింగ్ బిల్లులు, సీపీఎస్ రద్దు తదితర సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. త్వరలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, ఆనందరావు, అప్పిరెడ్డి, యాకూబ్, అబ్దుల్‌అజీజ్, శివప్రసాద్, సోమనబోయిన శ్రీనివాస్, శంకర్, సాహెబ్‌అలీ ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

కురవి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు పూల ఎల్లయ్య అన్నారు. లింగ్యతండా (కె)లో బుధవారం బడిబయట పిల్లలను గుర్తించేందుకు ఎంఈవో బాలాజీ, కాంప్లెక్స్ హెచ్ఎం వాహిద్ ఆదేశాల మేరకు తండాలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ బి.వెంకన్న ఇంటింటా సర్వేచేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం బడీడు పిల్లలు, బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించి వారికి విద్యాబోధన చేస్తుందన్నారు. 5 సంవత్సరాలు నిండిన బాలబాలికలను పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయా లని తల్లిదండ్రులకు సూచించారు. బడి మధ్యలో మానేసిన 18 సంవత్స రాల పైబడిన యువకులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పిస్తామని పేర్కొన్నారు.


లింగ్యతండాలో బడిబయట పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తున్న హెచ్ఎం ఎల్లయ్య, సీఆర్పీ వెంకన్న

నరేష్‌రెడ్డి స్మారకార్థం క్రీడాపోటీలు

మరిపెడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నేత నూకల నరేష్ రెడ్డి స్మారకార్థం ఆయన కుమారుడు నూకల అభినవ్‌రెడ్డి మరిపెడ హైస్కూల్ విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడాపోటీల నిర్వహణకు ఆర్థికసాయం అందచేశారు. బుధవారం ఆ పాఠశాలలో ఆటల పోటీలను నిర్వహించగా, అభినవ్‌రెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు క్రీడా పోటీలలో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకొని రేపటి విజయం కోసం క్రీడా మెళుకువలను అలవర్చుకోవాలన్నారు. రాంలాల్, అంబరీశ, కొంపెల్లి సురేందర్‌రెడ్డి, అల్వాల ఉపేందర్, భిక్షపతి, వెంకన్న, మరిపెడ ఉన్నత హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.

సురేందర్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్యులు

మరిపెడ రూరల్, జనవరి22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ మాజీఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిని ఖమ్మంలోని తన నివాసంలో మండలంలోనే గిరిపురానికి చెందిన ఆర్యవైశ్యులు సోమ నాగన్న, కిరణ్ మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి, మెమెంటోను బుధవారం అందజేశారు.మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని శ్రీమహేశ్వరి సాయికిరణ్ ట్రేడర్స్ ఈనెల 24న ప్రారంభోత్సవానికి రావాలని సురేందర్‌రెడ్డికి ఆహ్వానం నిచ్చారు.

'టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి'

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాల కృషిచేస్తానని వరంగల్ - నల్గొండ - ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. సీపీఎస్ రద్దు, 5డీఏల బకాయిలను ఇప్పిం చే బాధ్యత తనదేనని, పీఆర్టీయూ సుదీర్ఘ పోరాటంతోనే 370 జీవో బదిలీలు కొనసాగుతున్నాయన్నారు. ఉపాధ్యాయులందరూ తనకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి సతీష్‌రెడ్డి, నాయకులు విప్లవ్ రెడ్డి, రమేష్, నర్సింహరెడ్డి, చంద్రశేఖర్, జైపాల్ రెడ్డి, అశోక్, శ్రీనివాస్, దర్గా హుస్సేన్, వెంకన్న ఉన్నారు.

ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాల్స్ ఈనెల 25న ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ పాఠశాలల్లో ప్రజాస్వామ్యం, ఎన్నికల్లో భాగస్వామ్యం అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థులచే ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఈ కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను జిల్లా విద్యాశాఖ గ్రూపులో పంపించాలన్నారు.

చిన్నారులకు యూనిఫాంల పంపిణీ

కేసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బుధవారం యూనిఫాంను ఎంఈవో కాలేరు యాదగిరి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు తొలిదశలో యూనిఫాంలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవ్‌సింగ్, లలిత, లావణ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో న్యాయవాది మృతి

మహబూబాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో సీనియర్ న్యాయవాది మారంరాజు కృష్ణకుమార్ (63) బుధవారం మహబూబాబాద్‌లోని తన స్వగృహంలో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, సీనియర్ న్యాయవాది కొండపల్లి కేశవరావు, వెంకటేశ్వర్లు, రాజులు పట్టణంలోని కృష్ణకుమార్ స్వగృహానికి చేరుకుని ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. కాగా, కృష్ణకుమార్ గతంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. మృతుడు కృష్ణకుమార్‌కు భార్య అరుణాదేవి, కుమారుడు నితిన్‌కుమార్ ఉన్నారు.

ఎంఆర్‌పీఎస్ నేతల ప్రచారం


హైదరాబాద్ సభ విజయవంతానికి ప్రచారం నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

మరిపెడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఎంఆర్‌పీఎస్ సభ విజయవంతానికి మునిసిపల్ పరిధిలోని సీతారాంపూర్ కాలనీలో ఆ సంఘం జిల్లా బాధ్యులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతీ మాదిగబిడ్డ డప్పుతో ఫిబ్రవరి 7న హైదరాబాద్ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాగంటి రమేశ్, పోలెపాక ఎల్లయ్య, ఇరుగు రవి, దయాకర్, జినక స్వామి, వెంకటేశ్వర్లు, చింత వెంకన్న, ప్రసాద్, జినక ముత్తయ్య పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మత్తు పదార్థా లకు దూరంగా ఉండాలని, అప్పుడే పాలకుర్తిని డ్రగ్స్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ(సేనో టూ డ్రగ్స్) నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, విశిష్టఅతిథిగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ న్‌చార్జ్ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయి స్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చదువుకునే వయసులో యువత క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాట్లాడు తూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ సైదులు, సీఐ మహేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ సంతోష్ రెడ్డి, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి'

గార్ల, జనవరి22 (ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా సిబ్బంది విధులను నిర్వర్తించాలని కేంద్ర, రాష్ట్రవైద్య బృందం సూచించింది. బుధవారం గార్లలోని సీహెచ్‌సీ ఆస్పత్రిని ఈ బృందం తనిఖీ నిర్వహించింది. ఆస్పత్రి పరిసరాలు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రేప్లాంట్, రోగుల వార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రసవాల శాతాన్ని పెంచాలని కోరారు. సిబ్బంది ప్రభుత్వ నుంచి పూర్తిస్థాయిలో అలవెన్సులు పొందుతూ పట్టణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ, ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర బృందం సభ్యులు పీఆర్‌సీ మురిగేషన్, షతీల్‌కుమార్, డీపీవో నీలోహణ, ఎస్‌వో అరుణ్, సీహెచ్‌సీ డాక్టర్లు సూపరింటెండెంట్ శ్రీధర్‌గౌడ్, హనుమంతరావు, రాజ్ కుమార్‌జాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా జైనమందిర వార్షికోత్సవం


డోర్నకల్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న జైన మహిళలు

డోర్నకల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలోని శ్రీఆదినాథ్ జైనమందిర ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్, రెండో మెయిన్‌రోడ్డు మీదుగా శ్రీఆదినాథ్‌భగవాన్, మహావీర్‌భగవాన్ విగ్రహాలను జైనులు ఊరేగించారు. జైనధర్మ విశిష్టతను గూర్చి జైన మతపెద్దలు వివరించారు. మహిళలు పాల్గొన్నారు. మత పెద్దలు మహేందర్‌జైన్, కిశోర్‌జైన్, సుమీర్‌జైన్, అశోక్‌జైన్, రవీందర్‌జైన్, ప్రఫుల్‌జైన్, నరేష్‌జైన్, భారతిజైన్, రేణుకాజైన్, జ్యోతిజైన్, మమతాజైన్ పాల్గొన్నారు.

భూమి లేకున్నా అటవీ హక్కుపత్రాలు

• రైతుబంధు, బ్యాంకు రుణాలు పొందారని ఫిర్యాదు

• మాజీ వార్డు సభ్యుడు రవి ఆరోపణ

కేసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి భూమి లేకున్నా, సాగు చేయకపోయినా అక్రమంగా అటవీ హక్కుపత్రాలు పొంది, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ధన్నసరి శివారు ఎస్టీకాలనీ సబ్‌స్టేషన్‌తండా మాజీవార్డు సభ్యుడు వాంకుడోత్ రవి ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్, డీఎఫ్‌వో, ఎఫ్ఆర్‌వో, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఏవోలకు బుధవారం వేర్వేరుగా ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ధన్నసరి అటవీశాఖ కంపార్ట్‌మెంట్ నెంబరు 1183లో గత ఏడాది సుమారు 50 మంది ఎలాంటి భూమి సాగు చేయకున్నా కేవలం ఆధార్‌కార్డు జిరాక్స్‌లు ఇచ్చి అటవీహక్కు పత్రాలు పొందారని ఆరోపించారు. ఈ హక్కుపత్రాలతో రైతుబంధు, రైతుబీమా పథకాలతోపాటు బ్యాంకుల్లో పంట రుణాలు సైతం తీసుకున్నారని తెలిపారు. వెంటనే ఈ అక్రమాలపై విచారణ జరిపి పట్టాలను రద్దు చేసి రైతుబంధు డబ్బులను, బ్యాంకురుణాలను రికవరీ చేయాలని అధికారులను కోరారు.

మున్నూరుకాపు యూత్ కమిటీ ఎన్నిక


మున్నూరుకాపు యూత్ నూతన కమిటీ బాధ్యులు

ఇనుగుర్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి గ్రామ మున్నూరు కాపు యూత్ కమిటీని గౌరవ సలహాదారుడు వద్దిరాజు కిషన్ ఆదేశాలతో బుధవారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కొణతం నరేందర్ తెలిపారు. అధ్యక్షుడిగా బండి ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా మట్టపల్లి అశోక్, వెంపటి సందీప్, ప్రధాన కార్యదర్శిగా కొణతం ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా మదన ప్రశాంత్, గౌరవ సలహాదారులుగా పింగిళి శ్రీను, శ్రీరాం చందర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

• ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని, ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం నర్సంపేట బైపాస్ రోడ్డు పెట్రోల్‌బంక్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని జగ్జీవన్‌రావ్ కాలనీకి చెందిన కాంపల్లి వెంకటేష్ అతడి కుమారుడు వరుణ్‌సందేష్‌ను ఓ ప్రైవేటు పాఠశాలలో దింపేందుకు తన ద్విచక్రవాహనంపై వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుక్రాస్ చేస్తుండగా ఎదురుగా వచ్చే మరో ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వరుణ్‌సందేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. అతన్ని ఓ ప్రైవేటు వాహనం ద్వారా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

ఏడేళ్ల గోస.. తీరేనా ఆశ

(3వ పేజీ తరువాయి)

నమోదు చేసి ఆయా సర్వే నెంబర్లలో పట్టాపాస్‌పుస్తకాలు జారీ అయినట్లు సమాచారం. దీంతో ఆయా సర్వే నెంబర్లలో సాగు చేసుకుంటున్న అసలైన రైతులకు పట్టాపాస్‌పుస్తకాలు జారీ కాకుండా నిలిచిపోయాయి.

ఇంకా సమస్యలు..

మరోవైపు ఇదే నారాయణపురం గ్రామంలోని 151, 152 సర్వే నెంబర్లలో 200 ఎకరాల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినప్పటికీ పట్టాపాస్‌పుస్తకాలు జారీ కాలేదు. ఇదిలా ఉండగా కేసముద్రం, నెల్లికుదురు మండలాల మధ్యన నారాయణపురం, ఆలేరు గ్రామాల సరిహద్దులో 170 ఎకరాల్లో సాగు చేసుకుంటున్న రైతుల భూములు రికార్డుల్లో మరోసర్వే నెంబర్లు చూపుతుండడంతో ఎంజాయ్‌మెంట్ సర్వే చేయకుండానే నిలిచిపోయింది. వెరసి నారాయణపురంలో 1,162 ఎకరాల్లో సుమారు 800 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు రావాల్సిఉంది. వీరంతా ఏడేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదు.

తాజాగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దు చేసి ఆ స్థానంలో భూభారతిని తీసుకువచ్చి, భూసమస్యలను పరిష్కరించే ప్రక్రియలను సరళతరం చేసిన క్రమంలో అక్రమాలను అరికట్టి నిజమైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుతాయేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.